24 x 7 మద్యం



మల్కాపురం బార్ బయట ఉదయాన్నే మద్యం సేవిస్తున్న వ్యక్తులు

- పారిశ్రామిక ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- నిబంధనలకు తూట్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

పారిశ్రామిక ప్రాంతంలో మద్యం మంచినీరు కంటే సులభంగా దొరకుతుంది. ఎనీటైం డబ్బులు అందించడానికి ఏర్పాటు చేసిన ఏటీఎంలో సాంకేతిక లోపాలు.. నగదు లేమితో సేవలకు అంతరాయం కలుగుతుంది.. మద్యం మాత్రం ఎనీటైం లభ్యమవుతోంది. దీంతో చాలా కుటుంబాలు కుదేలవుతున్నాయి. గతంలో నివాసాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలంటే భయపడేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో అలాంటి భయాలులేవు. లైసెన్స్ ఉంటే చాలు ఎవరు ఎక్కడైనా మద్యం దుకాణం పెట్టుకో వచ్చునని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మద్యం వ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. బెల్ట్ షాపులను ప్రోత్సహించడంతో పాటు దొడ్డి దారిన విక్రయాలు చేస్తున్నారు. దీంతో మద్యం దుకాణాల ఆవరణలో వేళాపాలా లేకుండా మందుబాబులు తాగి చిందులు వేస్తున్నారు. అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై మహిళలు మండిపడుతున్నారు.

– మల్కాపురం



పారిశ్రామిక ప్రాంతమైన మల్కాపరం ప్రధాన సేవా మార్గంలో పోటాపోటీగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యం సేవించే వ్యక్తి బార్‌కు వెళ్తే ఎమ్మార్పీ కంటే అదనంగా చెల్లించాల్సి వస్తుంది. దీనికి తోడు మద్యం వ్యాపారాలు పెంచుకునేందుకు షాపుల పక్కనే ఉన్న దుకాణాలు అద్దెకు తీసుకుని వాటిని బార్ల మాదిరిగా మార్చేశారు. దీంతో ఆరుబయటే తాగుతున్నారు.

అంతా కార్మికులు, కూలీలే ..

పారిశ్రామిక ప్రాంతంలో అధికులు కార్మికులు, దినసరి కూలీలే. కాయకష్టం చేసిన వీరు మద్యం సేవిస్తుంటారు. ఇదే అదునుగా వ్యాపారులు అన్ని వేళలా మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల వద్ద కొనుగోలు చేసుకుని వేరే ప్రాంతంలో మద్యం సేవించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ వ్యాపారులు పక్కన మద్యం సేవించడానికి వీలుగా ఏర్పాటు చేయడంతో ప్రధాన సేవా మార్గంలో మందుబాబులు తూలుతున్నారు. ఆ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

నిబంధన ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల లోపు అమ్మకాలు జరపాలి. కానీ ఇక్కడ ఏ సమయంలోనైనా ఆయా షాపుల వద్ద మద్యం రహస్యంగా దొరుకుతుంది. నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మకాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదని ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఆ వైన్ షాపుల వెనుక రాజకీయ ముఖ్యనేతలు ఉండడం వల్లే వాటి జోలికి వెళ్లడం లేదని మహిళలు మండిపడుతున్నారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం ,పాత పెట్రోల్ బంక్, వాకింగ్ పార్కులు మందుబాబులతో నిండిపోతున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి



మద్యం షాపుల పక్కన వ్యాపారులు మందుబాబులను ప్రోత్సహించే విధంగా షాపులు పెట్టి తాగించడం చాలా దారుణం. ఇలాంటి అమ్మకాలు చెక్ పెట్టేలా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

– తోనంగి వెంకటరమణి, మహిళా నాయకురాలు

రోడ్డుపైకి రావాలంటే భయం



మల్కాపురం సేవా మార్గంపైకి రావాలంటే భయం వేస్తుంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా వైన్ షాపుల వద్ద మద్యం సేవించేవారు అడ్డంగా ఉంటారు.మద్యం మత్తులో వారు ఏమైనా చేస్తారేమోనన్న ఆందోళన రోడ్డుపైకి వచ్చినప్పుడు కలుగుతుంది. వీటిని కట్టడి చేయాలి.

– మౌనికాదేవి, మల్కాపురం

అధికారులు ఏం చేస్తున్నారు ?



ఎన్నడూ లేని విధంగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు విచ్చలవిడి అయిపోయాయి. దీంతో బడి, గుడి అన్న తేడా లేకుండా వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు పెట్టారు. వేళాపాలా లేకుండా దొడ్డిదారిన మద్యం విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

– మళ్ల ధనలత, మహిళా నాయకురాలు

బార్‌గా కల్యాణమండపం



మల్కాపురం మరిడి మాంబ కల్యాణ మండపం ఆవరణను బార్‌లా మార్చేస్తున్నారు. కొంత మంది యువత రాత్రి సమయాల్లో మద్యం సేవిస్తున్నారు.కల్యాణమండపం పై సచివాలయం ఉంది. సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి మెట్ల మార్గం వద్ద మద్యం సీసాలు,తినుబండారాల ప్యాకెట్లు దర్శనం ఇస్తున్నాయి.

– పిలక వరలక్ష్మి, మల్కాపురం

క్లుప్తంగా

లఘు చిత్రం చిత్రీకరణ



సన్నివేశంలో పాల్గొన్న నటీ నటులు

మల్కాపురం: పైడి ఫిల్మ్స్ నిర్మాణంలో పైడి మణికంఠ నిర్మాతగా,పైడి శంకరరావు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న మనసు అనే లఘు చిత్రం తొలి సన్నివేశాన్ని శనివారం విఘ్నేశ్వర ఆలయంలో చిత్రీకరించారు. సీనియర్ పాత్రికేయుడు రమణమూర్తితో పాటు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ క్లాప్ కొట్టారు. కార్యక్రమంలో నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘాల లీగల్ అడ్వైజర్‌గా ఆల్ఫా కృష్ణ



కృష్ణను అభినందిస్తున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

విశాఖ విద్య: యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘాలకు లీగల్ అడ్వైజర్‌గా బీఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ) నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన ఎన్ఏడీ ఏరియాలోని యునైటెడ్ క్రైస్ట్ చర్చి ఆవరణలో బాధ్యతలు స్వీకరించారు. ఆల్ఫా ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్న కృష్ణ యునైటెడ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా లీగల్ అడ్వైజర్ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు చర్చి పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలు విషయంలో నూటికి నూరు శాతం న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ సభ్యులకు, అడ్వైజర్ బోర్డు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చర్చిల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

జాతీయ బీచ్ వాలీబాల్ విజేతలకు నగదు పారితోషకం



బీచ్ వాలీబాల్ క్రీడాకారులకు చెక్కు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: బీచ్ వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షుడు గణబాబు నగదు పారితోషకం అందించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ బీచ్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న పురుషుల జట్టు బంగారు పతకం సాధించింది. ఒక్కొక్కరికి రూ.7.50లక్షల చొప్పున ఇద్దరికి రూ.15 లక్షలు నగదు బహుమతి అందించారు. క్రీడాకారులు దివ్యసాయి, మణికంఠ రాజులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్‌సంఘం కార్యదర్శి టీవీ భగవాన్ దాస్, సంఘ సభ్యులు మోహన్ బాబు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



దివ్య అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజ రాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, శోడషోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహి మాతను భూ ఆధారిత పంటలైన దాన్యత్వం మీద దివ్య అలంకరణ భూషితగా నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం రాత్రి లక్ష్య సాధన కోసం లక్ష్య వారాహీ హోమం నిర్వహించగా శనివారం రాత్రి స్వప్నవారాహీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా వారాహీ మాత మనకు స్వప్నంలో దర్శనమిచ్చి అమూల్యమైన సూచనలు చేస్తుందని భక్తుల విశ్వాసం. అదే విధంగా ఆదివారం రాత్రి తిరష్కరిణీ వారాహీ హోమం జరుగుతున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమం ద్వారా ప్రతికూల శక్తుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. గురుమాత అన్నపూర్ణ చేతుల మీదుగా అన్నసమారాధన నిర్వహించారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు శంకుస్థాపన



విద్యుత్ కేబుల్ పనులకు శంకుస్థాపన చేసిన విప్ గణబాబు

గోపాలపట్నం: భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు ప్రభుత్వ విప్ గణబాబు జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 33 కేవీ లైన్లు, 11 కేవీ లైన్లు లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇది మొత్తంగా 250 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, కంచరపాలెం, మల్కాపురం, శ్రీహరిపురం, జనతా కాలని, ములగాడ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు చేపడతామని.. ఈ కేబుల్ పనులకు రూ128.2 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అలాగే అండర్ గ్రౌండ్ పనులు పూర్తయిన తర్వాత రహదారి విస్తరణ ఉంటుందని తెలిపారు. అయితే ఇది కేవలం 40 అడుగుల రహదారి మాత్రమే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్యాంబాబు, జోన్-3 ఈఈ వర్క్స్ పోలాకి శ్రీనివాసరావు, ఏడీఈ రామ్‌నాయుడు, జీవీఎంసీ ఎస్ఈ కె. శ్రీనివాసరావు, ఈఈ దిలీప్ కుమార్, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



శిథిలమైన పలక



అదుపు తప్పితే ప్రమాదమే..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి సర్వీస్ రోడ్డులో సీఎంఆర్ ముందు అప్రోచ్ రోడ్డు వద్ద కల్వర్టుపై పలక విరిగిపోయింది. ఈ రహదారిలో వస్తూ పొరపాటున ఎడమ చేతిపైపు ద్విచక్రవాహనదారుడు తిరిగితే ఈ గొయ్యిలో పడి ప్రమాదం బారిన పడే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌పై నుంచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని పాదచారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పలక వేయించాలని కోరుతున్నారు.

ఎఫ్‌ఆర్‌యూలో ఉచిత వైద్యం అందాల్సిందే..

కౌన్సిల్‌లో కార్పొరేటర్ సురేష్



గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ

మల్కాపురం: నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వైద్యశాలను ప్రైవేట్ ఆస్పత్రికిగా మార్చేస్తాం అంటే ఎలా అని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ శనివారం జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రశించారు. 60వ వార్డు గుల్లలపాలెంలో 30 పడకల ఆస్పపత్రి (ఎఫ్ ఆర్‌యూ)ఉంది. ఇక్కడకు పారిశ్రామిక ప్రాంతం నలుమూల నుంచి నిరుపేద రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు.అయితే ఈ ఆస్పత్రిని కోరమాండల్ సంస్థ నిర్వహించాలని ఆలోచన చేసింది. దీనిలో భాగంగా ప్రస్తుత పాలకులను, అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. అయితే వారు రోగుల నుంచి నామ మాత్రపు ఫీజు వసూలు చేయాలని, ఎక్స్‌రే,రక్తపరీక్షలు ఇలా పలు సేవలకు నామ మాత్రపు ఫీజు తీసుకుంటామని ప్రతి పాదన పెట్టారు. దీనికి ప్రస్తుత పాలకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డబ్బులు వసూలు చేస్తే అది ప్రజా వైద్యశాల ఎలా అవుతుందని కార్పొరేటర్ పి.వి.సురేష్ తొలి నుంచి ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశం మరలా కౌన్సిల్‌లో చర్చకు వచ్చినప్పుడు ఆ ప్రతిపాదనను ఆయన పూర్తిగా వ్యతిరేకించారు. పేదలకు పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

ప్రసాదాల తయారీశాలకు స్థల పరిశీలన



అధికారులతో కలిసి స్థల పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై ప్రసాదాల తయారీకి నూతన శాల నిర్మాణానికి శనివారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం అన్న ప్రసాద భవనంపై అంతస్తుని ప్రసాదాల తయారీ వంటశాలతో పాటు లడ్డూలు చుట్టేందుకు, పులిహోర పంపిణీకి వినియోగిస్తున్నారు. దీంతో కింది అంతస్తులో భక్తులు అన్నప్రసాదం స్వీకరించేందుకు సరిపోవడం లేదు. ఈ తరుణంలో కొత్తగా భవనం నిర్మించి అందులోకి ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ సెక్షన్లను మార్పు చేసేందుకు కొన్నిరోజుల కిందట ప్రణాళిక వేశారు. ఈ మేరకు భవనం నిర్మించేందుకు అనువైన స్థలం కోసం ఈవో అధికారులతో కలిసి పరిశీలన చేశారు. త్వరలోనే కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు. భక్తులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా మాట్లాడాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యూలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని తెలిపారు. వంట పదార్థాలు తయారు చేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఈ హరి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తత్కాల్‌కు వచ్చేనెల ఒకటి నుంచి ఆధార్ తప్పనిసరి

అగనంపూడి: మారిన నిబంధనల ప్రకారం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రైళ్ల తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ కార్డు తప్పనిసరిగా నిర్ణయించారని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా టికెట్ పొందాలనుకొనేవారు విధిగా ఆధార్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని కోరారు. తక్కువ వ్యవధిలో తత్కాల్ టికెట్లు బుకింగ్ ముగియనున్న నేపథ్యంలో ముందుగానే ఆధార్‌నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

రాంజీ ఎస్టేట్‌లో పేదలకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు శనివారం అన్నసమారాధన నిర్వహించారు. దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని గొల్లమాల అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి వెంకటరావు, భీర భైరవమూర్తి, బొత్స అప్పారావు, టేకి గణేష్, అన్ను సుబ్రమణి, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

లఘు ఉద్యోగ్ భారతి జిల్లా కమిటీ కార్యవర్గ ఎన్నిక



లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖ జిల్లా లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం ప్రతినిధులు శనివారం ఎన్నుకున్నారు. గాజువాక ఆటోనగర్‌లో నిర్వహించిన ప్రతినిధులు సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జగపతిరాజు, పవన్‌జైస్వాల్, కోశాధికారిగా వరుణ్, ఉపాధ్యక్షుడిగా సత్య, సంయుక్త కార్యదర్శిగా నాగిరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల సమస్యలపై చర్చించారు. జిల్లా చాప్టర్ మాజీ అధ్యక్షుడు అట్లూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ఐపీ నిపుణులు పాల్గొన్నారు. పరిశ్రమలు ఖాయిలా పడే పరిస్థితుల్లో ఉన్నప్పుడు పారిశ్రామికవేత్తలు ఐపీ పెట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐపీ నిపుణులు విశ్వనాథశర్మ, నరేందర్‌రెడ్డి, సుజాత వివరించారు. ప్రభుత్వం, బ్యాంకుల మధ్య మధ్యవర్తిత్వం చేసి పరిస్థితుల నుంచి బయటపడేలా సహకరిస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా విత్తన బంతుల తయారీ



విత్తన బంతులు తయారు చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: అంకురానికి విద్యార్థులు స్వేదం చిందించారు. మట్టిలో రేపటి పచ్చదనం ఉంచి ఉండలుగా చుట్టారు. బంతులతో ఆడుకునే విద్యార్థులు విత్తన బంతులు తయారు చేశారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులు విత్తన బంతులు చేసే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గణబాబు విత్తన బంతులు తయారు చేసే విధానాన్ని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. రేపటి తరానికి పచ్చదనం అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిసి సుమారు 20వేల విత్తన బంతులు తయారు చేశారు. జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూరి అను మాట్లాడుతూ వీటిని వర్షా కాలంలో కొండలు, ఖాళీ స్థలాలు, రిజర్వాయర్ గట్లపై వేస్తామని చెప్పారు. విత్తన బంతుల్లో సీతాఫలం, బొప్పాయి, గంగరావి, సపోటా, నేరేడు, పనస, చింత, వేప, కుంకుడు, తురాయి, రేగు తదితర విత్తనాలు ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, వై స్వర్ణలత, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మజ్జూరి శ్రీనివాసరావు, వైఎస్ ప్రసాద్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు



కొత్తపాలెం జంక్షన్‌లో కాపలా కాస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జంక్షన్‌లో ఆకతాయిల బెడద తొలగించేందుకు గోపాలపట్నం సీఐ ఎస్వీ ప్రభాకర్ ప్రత్యేక పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆకతాయిల చేష్టలపై 'సాక్షి'లో కథనాలు రావడంతో ఆయన స్పందించారు. ఇద్దరు పోలీసులను నియమించి బహిరంగంగా మద్యం సేవించకుండా నిఘాపెట్టారు. ఎప్పటికప్పుడు ఇక్కడి పరిస్థితిని తెలిపేందుకు ఫొటోలు తీసి పంపుతున్నామని కానిస్టేబుళ్లు చెబుతున్నారు. సాయంత్రం సమయాల్లో సీఐ, ఎస్ఐలు కూడా ఈ ప్రాంతంలో పర్యటించడంతో ఆకతాయిల బెడద తగ్గిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.